## 245 పరిశుద్ధాత్మా, రమ్ము

రా – శ్రీరాగము తా – ఆది

రమ్ము రమ్ము పరిశుద్ధాత్మా – రమ్ము రమ్ము = రమ్ము దీవింపఁగ – నిమ్ము నీదు కృపను – నింపు మా డెందముల్ – నెమ్మదిఁ బొందంగ ॥రమ్ము॥

1. జీవంపు టూటవు – ప్రేమ జ్వాల వీవె = దేవ దాన మీవె – యాద రించువాఁడ ॥రమ్ము॥
2. దేవహస్త మీవె – వరము లన్ని నీవె = నీవె తండ్రి వాగ్ద – త్తమ్మయి వెలుంగుచుండు ॥రమ్ము॥
3. మాటలాడు శక్తి – నిచ్చి నాయాత్మను = మేటిల్ల నను నభి – షేకించుమీ దేవ ॥రమ్ము॥
4. ఇమ్ము నీదు వెలుఁగు – నింపు నీ ప్రేమతో = కమ్ము నాకుఁ తోడు = నన్ను బలపర్చుమా ॥రమ్ము॥
5. పారదోలు దవ్వు – నాత్మ శత్రువుల నిం = పార నీదు నెమ్మ – దిచ్చి ప్రోవు నన్ను ॥రమ్ము॥
6. ముందు నీవు నడువ – నన్ను దాయ దేది = యిందు నన్ను ఁ జెరచు – వారు లేరు భువిని ॥రమ్ము॥
7. జనకుఁ జూపు నాకు – నట్లె చూపు సుతుని = ననయ మెఱిఁగి దేవ నిను నమ్మి జీవింప ॥రమ్ము॥
8. జనక సుతాత్మయౌ – ఘనత్రిత్వమౌ దేవా = నిను సన్నుతింపను నీదు దయ నంపుమా ॥రమ్ము॥

– మేడికాయల సాధువు

## 246 పరిశుద్ధాత్మకొఱకైన ప్రార్థన

రా – యదుకులకాంభోజి (చాయ:తనువునాదిదిగో గైకొనుమీ) తా –త్రిపుట

పరిశుద్ధాత్ముఁడ ప్రభువ! – వరదా! మా హృదయమం – దిరముల వసి యింపుమా = అరుదైన నీదివ్య – తరశక్తులను దాల్చి – త్వరగా మాపై దిగుమా కరుణాబ్ధివై యిపుడు ॥పరిశుద్ధాత్ముఁడ॥



1. పరమండలాగ్నివై – యరుదెంచి మా హృదయాం – తర దురితతూలం బును = దరికొల్పి పరిశుద్ధ పఱచి మా యాత్మల మా–వరరక్షకునకు న – ర్పణ ముగా నిడుమయ్య ॥పరిశుద్ధాత్ముఁడ॥
2. కాంతులీనెడు దీప – కలికవైవచ్చి మా – స్వాంతంబులఁగప్పిన = యంతు లేని యవిద్యా – ధ్వాంతంబుఁ జోపి సు – స్వాంతులేగెడు సత్య – సరణిఁ జూపింపుమా ॥పరిశుద్ధాత్ముఁడ॥
3. చలువఁ గూర్చెడు మంచు–జల్లురూపమున మ – మ్ముల నెల్ల దీవింపుమా = ఫలశూన్యంబైన యా – ఆత్మలకు నీ బల మొసఁగి–ఫలవంతములుగ గే–వలుఁడా యొనరింపుమా ॥పరిశుద్ధాత్ముఁడ॥
4. పరమ పారావతమా!–పక్షములు విప్పి మా – శిరములపైని చాఁచి = పరమందు నీ సంఘ – పరిశుద్ధులకువలెనె – ధరనున్న మాకు నీ – వరముల నిడుమయ్య ॥పరిశుద్ధాత్ముఁడ॥
5. దివినుండి భువికి నా – రవముతో వీతెంచు –పవమానాకారుండవై = నవ జన్మసంప్రాప్తికవరోధమొనరించు – భవదుఃఖాంబుధ పటలిఁ బాఱఁ దోలుము కృపచేఁ ॥పరిశుద్ధాత్ముఁడ॥
6. అందమౌ నీమోము – నందుఁ జిందెడు తేజ–మందఱు వీక్షింపగా = విందవై వచ్చి మా – డెందంబులకు నిత్యా – నందంబుఁగూర్చి మా – వందనంబులు గొనుమా ॥పరిశుద్ధాత్ముండ॥

–దాసరి మోజెస్

## 247 పరిశుద్ధాత్ముని ప్రాపు

రా – కాంభోజి (చాయ: అన్ని కాలంబుల) తా – అట

పరిశుద్ధాత్మ ప్రభుని – వరదివ్యశక్తిబం – ధురము ధరణికిజీవ – సంజీవము – పరమౌన్నత్యంబైన – పరలోక సువిశేష – పరమార్థములు దెలుపు నెఱిమార్గము ॥పరి॥